క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో మార్చి 1న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఎల్‌బీ.నగర్, తిలక్ రోడ్డు, నర్సంపేట రోడ్డు, లోతుకుంట, షాదీఖానా, ఈఎస్ఐ ఆస్పత్రి, ఎస్ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, జాన్‌పీరీలు, శివనగర్, ఆయుర్వేదిక్ కళాశాల, 100 ఫీట్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సైన్స్‌ల్యాబ్ ప్రారంభం

విద్యారణ్యపురి: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జులైవాడలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శన, అలాగే పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ల్యాబ్‌ను హనుమకొండ జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి పురోభివృద్ధికి సైన్స్, సాంకేతిక రంగాల అభివృద్ధే కారణమన్నారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం భాస్కర్ రెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులు వీరయ్య, సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

కండక్టర్ నిజాయితీ



కాజీపేట: బస్సులో దొరికిన బంగారు బ్రాస్‌లెట్‌ను బాధితుడికి అందించి ఆర్టీసీ కండక్టర్ తన నిజాయితీ చాటుకున్నారు. కాజీపేట నుంచి జనగామకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ప్రేమ్‌కుమార్ బ్రాస్‌లెట్ కిందపడిపోయింది. దాన్ని గుర్తించిన కండక్టర్ రాజయ్య.. కాజీపేట పోలీసులకు సమాచారం ఇచ్చి బాధితుడు ప్రేమ్‌కుమార్‌కు అందజేశారు. ఈమేరకు కండక్టర్ రాజయ్యను సీఐ సుధాకర్ రెడ్డి, ఎస్సై నవీన్ కుమార్ అభినందించారు.

నిరుపేదలకు సేవ చేయడమే ధ్యేయం




న్యూశాయంపేట: నిరుపేదలకు సేవ చేయడమే తమ ధ్యేయమని పబ్లిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మహ్మద్ హబీబుద్దీన్ అన్నారు. హనుమకొండ వడ్డేపల్లిలోని కార్యాలయంలో వైద్య చికిత్సల నిమిత్తం పలువురు నిరుపేదలకు రూ.10 వేల చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఎజాజ్, సెక్రటరీ మహ్మద్ అన్వర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మహ్మద్ సలీం పాల్గొన్నారు.

గుడి అభివృద్ధికి చేయూత



మామునూరు: వరంగల్ నక్కలపల్లి గ్రామంలో నిర్మిస్తున్న పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులకు వాసవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఎలగందుల అమృత వృద్ధాశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎలగందుల లక్ష్మీనారాయణ చేయూతనిచ్చారు. ఈమేరకు పోచమ్మ ఆలయాన్ని శుక్రవారం సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. వాసవి ట్రస్ట్ నిర్వహణ కార్యదర్శి ఎలగందుల శ్రీనివాస్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు రాజేంద్ర ప్రసాద్, లక్ష్మీనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

‘శ్వేతార్క’లో చండీహోమం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో నిత్య మాసోత్సవ చండీ హోమాన్ని శుక్రవారం నిర్వహించారు. అర్చకుడు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో జరిగిన హోమంలో ఆలయ కార్యకర్తలతో పాటు భక్తులు పాల్గొన్నారు. హోమంలో అయినవోలు సాయికృష్ణ శర్మ, రజిత, సాయికుమారి, ఉమాదేవి, విజయకోటి, సులోచన, సునంద తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి ఉత్సవాలు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలో ప్రపంచశాంతి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శారద వీఎస్ హైస్కూల్ ప్రిన్సిపాల్ భూపాల్ రావు అధ్యక్షతన ప్రపంచ శాంతి ఉత్సవాలు శుక్రవారం జరిగాయి. వరంగల్ శాంతి ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి మండల పరశురాములు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గుండు ఉమాదేవి, స్వేచ్ఛ, గౌతమి, రమ్య పాల్గొన్నారు.

చరిత్ర ప్రతిబింబించేలా..

- వరంగల్ రైల్వేస్టేషన్‌కు సరికొత్త సొగబులు
- అమృత్ భారత్ స్టేషన్ పథకం ప్రణాళికలు
- రూ.25.41కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి



వరంగల్ రైల్వేస్టేషన్ నమూనా చిత్రం

ఖిలా వరంగల్: అమృత్ భారత్ స్టేషన్ పథకంలో వరంగల్ రైల్వేస్టేషన్ ఎంపికై ంది. దీంతో రైల్వే ప్రయాణికులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలు అందించాలనే సంకల్పంతో భారతీయ రైల్వే వరంగల్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధికి నిర్ణయం తీసుకుంది. దీనిలో భాగంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ (ఏబీఎస్ఎస్) కింద రూ.25.41కోట్లను ప్రభుత్వం కేటాయించింది. ఈ నిధులతో ప్రపంచ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రైల్వే మంత్రిత్వ శాఖ రైల్వే స్టేషన్‌ను అధునికీకరించడం, దీర్ఘకాలిక దృష్టితో నిరంతర ప్రాతిపదికన అభివృద్ధిని చేయడం లక్ష్యంగా అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్ విధానానికి రూపకల్పన జరిగింది. అవసరాలకు అనుగుణంగా చారిత్రక వరంగల్ సంస్కృతి ప్రతిబింబించేలా రైల్వే స్టేషన్ విస్తరించేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించి ఈ ఆర్థిక సంవత్సరంలో అభివృద్ధి పనులు పూర్తి చేయనున్నట్లు దక్షణ మధ్య రైల్వే ప్రజా సంబంధాల అధికారి ఏ.శ్రీధర్ తెలిపారు.

సంస్కృతి ప్రతిబింబించేలా అభివృద్ధి..

వరంగల్ నగర నడిబొడ్డున ఉన్న వరంగల్ రైల్వేస్టేషన్ కాకతీయులు శిల్పకళ ఉట్టిపడేలా రూపుదిద్దుకోనుంది. సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించేలా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దేశంలోని వివిధ ప్రాంతాలను కలుపుతూ ఉన్న వరంగల్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధిలో భాగంగా దివ్యాంగ ప్రయాణికులకు ప్రత్యేక టాయిలెట్లు, ర్యాంప్ సదుపాయాలు రూపుదిద్దుకుంటున్నాయి. నాన్- సబర్బన్ వెయింటింగ్ హాల్స్, ఫుడ్ స్టాల్స్, రెస్ట్ రూంలతో ప్రయాణికులకు అనుకూలమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. కాజీపేట-విజయవాడ సెక్షన్‌లో ఉన్న ఈ స్టేషన్ రూ.41.09 కోట్ల వార్షిక ఆదాయం కలిగి ఉంది. సగటున రోజుకు 31,887 మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు 137 రైళ్లు ఆగుతాయి. న్యూఢిల్లీ, హౌరా, చెన్నై, విజయవాడ, విశాఖపట్నం, సికింద్రాబాద్, తిరుపతి వంటి మార్గాల్లో నడుస్తున్న సూపర్ ఫాస్ట్ రైళ్లకు ఇక్కడ హాల్టింగ్ ఉండడం గమనార్హం.

అభివృద్ధి ఇలా..

- చరిత్ర ఉట్టిపడేలా స్టేషన్ భవనం, ముఖద్వారం అభివృద్ధి
- ఆకర్షణీయమైన ప్రవేశ ద్వారం ఏర్పాటు
- ప్రయాణికుల సౌకర్యార్థం 12 మీటర్ల వెడల్పు గల ఫుట్ ఓవర్ బ్రిడ్జి, 3 లిఫ్టులు, 4 ఎస్కలేటర్లు ఏర్పాటు
- ప్లాట్ ఫారం పై అదనపు కప్పు ఏర్పాటు
- ఇప్పటికే ఉన్న టాయిలెట్ల మెరుగుదల, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు
- వెయిటింగ్ హాల్ అభివృద్ధి
- స్టేషన్ ప్రాంతాల్లో కళలు, సంస్కృతి ప్రతిబింబించే చిత్రాలు
- స్టేషన్ ఆవరణలో పచ్చదనాన్ని పెంచడం, ట్రాఫిక్ ఏర్పాట్లు
- ప్రయాణికులకు అనుకూలమైన సంకేతాలు, రైలు సూచిక బోర్డులు, కోచ్ సూచిక బోర్డుల ఏర్పాటు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



హన్మకొండ అర్బన్: వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



కాజీపేట తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ..

హన్మకొండ అర్బన్ / ఖిలా వరంగల్ / హసన్‌పర్తి / కాజీపేట అర్బన్: ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గడ్డం నాగార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా నాయకులతో కలిసి హనుమమకొండ తహసీల్దార్ కార్యాలయంలో నాయబ్ తహసీల్దార్ రంజిత్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఖిలా వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. పార్టీ మేనిఫెస్టోల్లో పొందపర్చిన ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) మండల కమిటీ సభ్యురాలు ప్రేమలత డిమాండ్ చేశారు. ఈమేరకు హసన్‌పర్తి తహసీల్దార్ చల్లా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు మాస్ సావిత్రి డిమాండ్ చేశారు. ఈమేరకు కాజీపేట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ భావ్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు పాల్గొన్నారు.

కాకతీయుల కోటలో జెన్నిఫర్ లార్సన్



శిల్పకళా సంపదను తిలకిస్తున్న జెన్నిఫర్

ఖిలావరంగల్/హన్మకొండ కల్చరల్ : ఖిలావరంగల్‌లోని మధ్యకోటను శుక్రవారం అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సందర్శించారు. సందర్శించారు. శిల్ప కళాకృతులతో నిర్మించిన కట్టడాలను చూసి మహాఅద్భుతంగా (వేరి బ్యూటీఫుల్)గా ఉన్నాయని కితాబిచ్చారు. రాతి, మట్టికోట, ఏకశిల చిల్డ్రన్ పార్కు, ఏకశిల గుట్ట, ఖుష్మహాల్‌ను సందర్శించారు. కాకతీయుల విశిష్టత, చారిత్రక కట్టడాల గురించి టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ సూర్యకిరణ్, గౌడ్ రవియాదవ్ వివరించారు. అదేవిధంగా వేయిస్తంభాల దేవాలయాన్ని శుక్రవారం అమెరికా కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ సందర్శించారు. కలెక్టర్ ప్రావీణ్య ఆదేశానుసారం ఆమెను ఆలయప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, అనిల్‌కుమార్ జెన్నిఫర్ లారెన్స్‌ను ఆలయమర్యాదలతో స్వాగతించారు. రుద్రేశ్వరస్వామిని జెన్నిఫర్ దర్శించుకున్న అనంతరం వేద పండితులు తీర్థప్రసాదాలు, మహాదాశీర్వచనం అందజేశారు. ఈఓ శాలువాతో సన్మానించారు.

యునాని వైద్యంతో ఆరోగ్యానికి మేలు



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ప్రమీలాదేవి

నయీంనగర్: సహజసిద్ధమైన ప్రకృతి వైద్యం యునాని వైద్యం.. మానవాళి ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనకరమని వరంగల్ ఆయుష్ ఉప సంచాలకురాలు డాక్టర్ ప్రమీలాదేవి అన్నారు. 53వ డివిజన్ లష్కర్‌సింగారం అయేషా మజీదు కమిటీ, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గోపాలపురం సంయుక్తంగా శుక్రవారం నిర్వహించిన ఉచిత యునానీ ఆరోగ్య శిబిరంలో ప్రమీలాదేవి మాట్లాడారు. నేటి సమాజంలో అనేక కాలుష్యాలు, కల్తీమయమైన తినుబండారాలు, ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్‌తో చాలామంది అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. జిల్లా సంక్షేమ అధికారి జె.జయంతి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని అన్నారు. కార్పొరేటర్ సోదా కిరణ్, కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, ఎర్ర మహేందర్, దామెర నర్సయ్య, తేరాల యుగేందర్, జి.యాదగిరి, వైద్యాధికారులు మహేందర్ కుమార్, సార ఫిర్దోష్, షగుఫ్త, కిరణ్‌కుమార్, ఖాసీం, ముర్తుజా, సత్తార్, చింత రాజేష్, రాజేందర్ పాల్గొన్నారు.

విద్యకు 15శాతం బడ్జెట్ కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న డీబీఎఫ్ నాయకులు

హసన్‌పర్తి: బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు డీబీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. ఎల్లాపురంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి హసన్‌పర్తి తహసీల్దార్ కార్యాలయం వరకు ఈ యాత్ర సాగింది. అనంతరం తహసీల్దార్ చల్లా ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌కుమార్ మాట్లాడుతూ అందరికీ సమానమైన, నాణ్యమైన విద్యనందించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో కనీస సదుపాయాలు కల్పించాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 27శాతం పాఠశాలల్లో మూత్రశాలలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, డీబీఎఫ్ నాయకులు నరేష్, సంపూర్ణ, అనిత, కొమురయ్య, సదానందం, దాస్ పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

సర్ సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని నగర వ్యాప్తంగా శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈమేరకు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్‌పై ఆసక్తి పెంచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, అతిథులు



వరంగల్ శంభునిపేట దూపకుంట రోడ్డులోని బాలికల మైనార్టీ గురుకులంలో ఎగ్జిబిట్ల ప్రదర్శన



పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త రాజేందర్‌రావు



హసన్‌పర్తి: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో..



హంటర్‌రోడ్డులోని రీజనల్ సైన్స్ సెంటర్‌లో కేయూ ఫార్మసీ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రసాద్

కమ్యూనిస్టు పార్టీలు ఏకతాటిపైకి రావాలి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వెంకట్ రెడ్డి

వరంగల్ చౌరస్తా: దేశంలో అన్ని కమ్యూనిస్టు పార్టీలు ఐక్యం కావాలని, ఎర్రజెండా నీడలో ఉంటూ మరో అదే జెండా పార్టీకి చెందిన నాయకులు, సిద్ధాంతాలపై పరస్పరం విమర్శలు చేసుకోవడం సరికాదని ఎంసీపీఐ పొలిట్ బ్యూరో సభ్యుడు మర్రెడ్డి వెంకట్ రెడ్డి సూచించారు. వరంగల్ జిల్లా కేంద్రంలోని వెంకట్రామ జంక్షన్‌లో పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం కేంద్ర కమిటీ సభ్యుడు సింగతి సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో వెంకట్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో అవినీతి, అక్రమాలు, మతోన్మాద చర్యలు పెరుగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఓంకార్ సిద్ధాంతాలకు తూట్లు పొడుస్తూ ఎంసీపీఐ(యూ) పేరు చెప్పుకుంటూ ఆయన ఆశయాలను విస్మరించడం బాధాకరమని వాపోయారు. సమావేశంలో అఖిల భారత కిసాన్ ఫెడరేషన్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్‌రావు, ఏఐసీటీయూ రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర అధ్యక్షుడు నరసయ్య, యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు తాటికొండ రవి మాదం తిరుపతి, నాయకులు రాజేష్, శేఖర్, బాషిపాక, రమేష్, కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు

కేయూ క్యాంపస్: విద్యార్థులు తమ ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించొద్దని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి సూచించారు. కాకతీయ యూనివర్సిటీలోని స్టూడెంట్స్ వెల్ఫేర్ సెల్ ఆధ్వర్యంలో మెడికవర్ ఆస్పత్రి సహకారంతో విద్యార్థినులకు ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, స్టూడెంట్స్ వెల్ఫేర్ సెల్ డైరెక్టర్ డాక్టర్ నిరంజన్‌శ్రీనివాస్, హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ సుజాత, గైనకాలజిస్టు డాక్టర్ అమతులహప్యా, తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయానికి గ్రీన్ సిగ్నల్‌పై బీజేపీ హర్షం

హన్మకొండ: వరంగల్ మామునూరు విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పాటు విమానాశ్రయ అభివృద్ధి, నిర్వహణకు ఆమోదం తెలుపుతూ అనుమతి ఇవ్వడంపై బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి, హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కృషి వల్లనే విమానాశ్రయం సాధ్యమైందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు డిటెన్షన్ సడలించాలి



వీసీకి వినతిపత్రం అందజేస్తున్న బాధ్యులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ కోర్సుల విద్యార్థులకు అమలు చేస్తున్న డిటెన్షన్ విధానాన్ని సడలించాలని పలు విద్యార్థి సంఘాల బాధ్యులు కోరారు. ఈమేరకు కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిటెన్షన్ విధానంతో విద్యార్థులు డ్రాప్‌అవుట్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ విద్యలో ఈవిద్యా సంవత్సర నుంచి డిటెన్షన్ విధానాన్ని సడలించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, గౌడ్ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కన్వీనర్ హకీంనవీద్, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి ఆలువాల కార్తీక్, బీఆర్ఎస్‌వీ నాయులు కలకోట సుమన్, ఎంఎస్ఎఫ్ నాయకులు తిరుపతిమాదిగ, డాక్టర్ మధు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయి, వికలాంగుల సంఘం ఇన్‌చార్జ్ నాగరాజు, అశోక్ పాల్గొన్నారు.

దర్జీలకు సన్మానం



హన్మకొండ చౌరస్తా: అంతర్జాతీయ టైలర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌కు ఎదురుగా ఉన్న విన్ టైలర్స్‌లో దర్జీలను శుక్రవారం సన్మానించారు. సీపీఐ హనుమకొండ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ ప్రపంచానికి నాగరికతను చాటిచెప్పడంలో దర్జీల పాత్ర కీలకమైందని కొనియాడారు. రెడీమేడ్ రంగంతో మేర కులస్తుల వృత్తి ప్రమాదంలో పడిందని, ప్రభుత్వాలు మేరలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. తెలంగాణ మేర సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు తాళ్ల సంపత్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తాళ్ల దయానంద్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ఏఐటీయూసీ నాయకులు వేల్పుల సారంగపాణి, సీపీఐ నాయకులు కొట్టెపాక రవి, తాటిపెల్లి వెంకటేశ్వర్లు, దామెర సుదర్శన్, టైలర్ కార్మికులు పాల్గొన్నారు.

పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం



సదారెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, జేఏసీ నాయకులు

వరంగల్ అర్బన్: బల్దియాలో దీర్ఘకాలంగా సేవలందించి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను కౌన్సిల్ హాల్‌లో అనుముల సదారెడ్డి, పీహెచ్ వర్కర్లు తిప్పారపు మొగిలి, జన్ను సుగుణను శుక్రవారం సాయంత్రం సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. జేఏసీ సభ్యుడు సర్జన్ రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఎంహెచ్ఓ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ఎంహెచ్ఓ రాజేష్, ఏసీపీలు ఖలీల్, శ్రీనివాస్ రెడ్డి, సూపరింటెండెంట్ ఆనంద్, జేఏసీ ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్, ప్రతినిధులు రాజారపు భాస్కర్, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుందూరు వెంకట్‌రెడ్డి సేవలు అభినందనీయం



వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న డిపో మేనేజర్ ధరంసింగ్, తదితరులు

హన్మకొండ: ఉద్యోగిగా కుందూరు వెంకట్‌రెడ్డి సేవలు అభినందనీయమని ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ భూక్య ధరంసింగ్ కొనియాడారు. హనుమకొండ రాంనగర్‌లోని ఆర్టీసీ హనుమకొండ డిపోలో ఏడీసీ వెంకట్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలు అందించి సన్మానించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ ఏడీసీ వెంకట్‌రెడ్డి అంకితభావం, కార్యదీక్షతో పనిచేసేవారని గుర్తుచేశారు. ఏ ఉద్యోగికైనా విరమణ సహజమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుందూరు వెంకట్‌రెడ్డి సతీమణి శోభ, కుటుంబ సభ్యులు శృతి రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, నాగిరెడ్డి, మానస, ద్వైత, కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో విడత కులగణన శుక్రవారంతో ముగిసింది. మొత్తం 1,037 దరఖాస్తులు నమోదైనట్లు బల్దియా అధికారులు వెల్లడించారు. తప్పిపోయిన, సర్వే సమయంలో అందుబాటులో లేని వారి కోసం ప్రభుత్వం ఈ అవకాశం కల్పించింది. దీంతో ఈనెల 16 నుంచి 28వ తేదీ వరకు 8 ఈ-సేవా కేంద్రాలు, టోల్ ఫ్రీ నంబర్, మొబైల్ నంబర్‌కు, ఆన్‌లైన్ ద్వారా ఫారాలను డౌన్ లోడ్ చేసుకొని అందజేసే వెసులుబాటును బల్దియా కల్పించింది. ఈదరఖాస్తుల్ని ‘ఆన్‌లైన్’లో ఎప్పటికప్పుడు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్, తదితరులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో 75 ఇయర్స్ ఆఫ్ ఇండియన్ కాన్స్టిట్యూషన్ – మైల్ స్టోన్స్ – ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అనే అంశంపై ఈనెల 18, 19వ తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ఎస్సీ, ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ రాజమణి తెలిపారు. ఈమేరకు సదస్సు పోస్టర్లను కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేయూ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ సురేష్‌లాల్, డాక్టర్ చిర్రరాజు, పుల్లూరు సుధాకర్, గాదె సమ్మయ్య, ప్రొఫెసర్ మనోహర్, మల్లికార్జున్ రెడ్డి, శ్రీనివాస్, ప్రొఫెసర్ రామనాథ్ కిషన్ పాల్గొన్నారు.

స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టిన లారీ

వరంగల్: వరంగల్ ఆరెపల్లి వంగపహాడ్ క్రాస్‌రోడ్డు వద్ద శుక్రవారం రాత్రి ఓ ప్రైవేట్ స్కూల్‌కు చెందిన టాటా మ్యాజిక్ వ్యాన్‌ను లారీ ఢీకొట్టింది. దాంతో అందులోని విద్యార్థులు స్వల్పంగా గాయపడినట్లు తెలిసింది. వంగపహాడ్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న లారీ క్రాస్‌రోడ్డు వద్ద వరంగల్ నుంచి ఊరుగొండ వైపు వెళ్తున్న టాటా మ్యాజిక్ వాహనాన్ని ఢీకొట్టింది. సంఘటన స్థలాన్ని ఏనుమాముల ఎస్సై రాజు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

డే కేర్ సెంటర్‌ను వినియోగించుకోవాలి



హన్మకొండ: వయోవృద్ధులు డే కేర్ సెంటర్‌ను వినియోగించుకోవాలని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ కరుకాల అనితారెడ్డి అన్నారు. హనుమకొండ ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణలోని సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్‌లో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డే కేర్ సెంటర్‌లోని ఫిజియోథెరఫీ వైద్యాన్ని, వ్యాయామానికి సంబంధించిన ఆట వస్తువులను వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, సుబేదారిలోని రెడ్‌క్రాస్ సొసైటీలో వయో వృద్ధులకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిజియోథెరఫిస్ట్ డాక్టర్ ఉష, వాణి పాల్గొన్నారు.